చింతల రవికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న వీ3 న్యూస్ ఛానల్, విశ్వంభర దినపత్రిక ఛైర్మన్ డా. కాచం సత్యనారాయణ

జలమండలి ఉద్యోగుల సమస్యల సత్వర పరిష్కరానికి చొరవ తీసుకోవాలి

టిపిసిసి అధ్యక్షులుమహేష్ కుమార్ కి వినతిపత్రం అందజేసిన మొగుళ్ళ రాజిరెడ్డి

విశ్వంభర, హైదరాబాద్ : దీర్ఘకాలికంగా పెండింగ్ లోఉన్న జలమండలి ఉద్యోగ, కార్మికుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు, జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి, ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్ర శేఖర్ ల నేతృత్వంలో తెలంగాణ జలమండలి జేఏసీ నాయకులు హైదరాబాద్, హైదర్ గూడా, ఓల్డ్ ఎమ్మెల్యే కోటార్స్ లో సోమవారం టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. వెంటనే జలమండలి గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలు జరపాలని, వాటర్ బోర్డు విస్తరణ నేపథ్యంలో ఏర్పడుతున్న పరిపాలనా మరియు ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. మహానగరం వేగంగా విస్తరించడంతో వాటర్ బోర్డు పరిధి దాదాపు 300 సెక్షన్లకు పెరిగిందని, ఈ పరిస్థితుల్లో ఉద్యోగుల బదిలీల విషయంలో అనవసరమైన ఆందోళనలు నెలకొన్నాయని యూనియన్ ప్రతినిధులు వివరించారు.

ఈ విషయంపై స్పందించిన మహేష్ కుమార్ గౌడ్ వెంటనే జలమండలి ఎండీ తో ఫోన్ ద్వారా మాట్లాడి, ముఖ్యంగా మహిళా ఉద్యోగులు, మెడికల్ గ్రౌండ్స్‌లో ఉన్న ఉద్యోగులు, అలాగే రిటైర్మెంట్‌కు దగ్గరలో ఉన్న ఉద్యోగులను పరిగణనలోకి తీసుకొని వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల కోసం అమలు చేస్తున్న హెల్త్ ఇన్సూరెన్స్ మరియు ప్రమాద బీమా పథకాలు వాటర్ బోర్డు ఉద్యోగులకు కూడా వర్తించేలా చర్యలు తీసుకోవాలని యూనియన్ తరఫున విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై స్పందించిన మహేష్ కుమార్ గౌడ్ గారు వాటర్ బోర్డు ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత అధికారులతో చర్చించి త్వరలోనే ఈ పథకాలు వాటర్ బోర్డు ఉద్యోగులకు కూడా అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.వాటర్ బోర్డు ఉద్యోగుల సంక్షేమం కోసం తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ ఎప్పటికప్పుడు పోరాటం కొనసాగిస్తుందని, ఉద్యోగుల హక్కుల సాధనలో ఎల్లప్పుడూ ముందుంటుందని మొగుళ్ళ రాజి రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి జేఏసీ నాయకులు కె. రాజ్ రెడ్డి, ట్ అల్లి శ్రవాన్ కుమార్, రాఘవేంద్ర రాజ్, బి. జై రాజ్, కె.ఆనంద్ రెడ్డి, బి.శంకర్ ప్రకాష్, ఇందూరి తిరుపతి, సి.రాజు, ఏ. అశోక్, బి.అశోక్, విగ్నేష్, సిహెచ్. ప్రవీణ్ కుమార్, రవీందర్, శ్రీను, జంగయ్య, రాజేష్, బి. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జాగృతి అధ్యక్షురాలు కవిత అరెస్ట్

విశ్వంభర, ఖమ్మం : ఖమ్మం వెలుగుమట్ల లో ఇండ్లు కోల్పోయిన బాధితులను సోమవారం ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవన్ లో పరామర్శించిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భూధాన్ బాధితులకు న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటామని, ఇప్పటివరకూ బాధితులకు ప్రభుత్వం అండగా లేదని విమర్శించారు. ప్రభుత్వం తరఫున వారికి వైద్య సహాయం కూడా అందలేదని, కవిత పేర్కొన్నారు. అనంతరం ర్యాలీ గా ఖమ్మం లోని జెడ్.పి సెంటర్ లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద భూదాన్ నిర్వాసితులతో కలసి న్యాయం చేయాలంటూ ధర్నా నిర్వహించారు. బాధితులతో కలిసి జడ్పీ కూడలిలో రోడ్డుపై బైఠాయించారు.

దీంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని జాగృతి కార్యకర్తలను, భూధాన్ బాధితులను చదరగొట్టి కొద్దిమంది కార్యకర్తలను వానాలపై ఎక్కించుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. నాలుగు గంటల వ్యవధి అనంతరం పోలీసులు జాగృతి అధ్యక్షురాలు కవితను అరెస్టు చేసారు.

"బాలవికాస" మహిళా దినోత్సవం

విశ్వంభర, జమ్మికుంట : జమ్మికుంట బాలవికాస ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. పత్తి మార్కెట్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మహిళలు పాల్గొన్నారు. ఆటలు ,పాటలతో హోరెత్తించారు. అనంతరం జరిగిన సమావేశాన్ని ఉద్దేశించి మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం మాట్లాడుతూ మహిళలేనిదే మనుగడ లేదని, సృష్టికి మూలమైన స్త్రీలు పురుషులతో పోటీపడుతూ తమ సత్తా చాటుతున్నారని అన్నారు. జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగూరి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ మహిళలు ఆకాశమే హద్దుగా ఎదుగుతూ సమాజంలో కీలక భూమికను పోషిస్తున్నారని, అయినా ఇంకా వివక్షకు గురవుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు చైతన్యవంతంగా జీవిస్తే కుటుంబాలు గర్వంగా నిలబడతాయని అన్నారు. బేతిగల్ సర్పంచ్ చొప్పరి స్వరూప, మడిపల్లి సర్పంచ్ పసుల తిరుమల వెంకటేష్, పెద్దంపల్లి సర్పంచ్ ఎగిత పద్మ, కౌన్సిలర్లు పోలు దివ్య, మైస శిరీష, వార్డు మెంబర్లు హసీనా, గుజ్జుల అనూష, కృష్ణవేణి, దొడ్డె లావణ్య ,బాలవికాస జమ్మికుంట సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన, కోఆర్డినేటర్లు సుమలత, స్వాతి, ఆసియా మరియు విలేజ్ లీడర్లు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గ్రేట్ మిలీనియం మార్చ్ డేను విజయవంతం చేదాం

చలో గన్ పార్క్

విశ్వంబర, ఎల్బీనగర్ : తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం 10 వ తెదిన మిలియన్ మార్చ్ స్మృతులను గుర్తు చేసుకుంటూ తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ పిలుపు మేరకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న తెలంగాణ ఉద్యమకారులంతా తరలివచ్చి "మిలియన్ మార్చు స్మృతుల, తెలంగాణ అమరవీరులను స్మరించుకుందాం అని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, తెలంగాణ ఉద్యమనాయకుడు డాక్టర్ వీరమళ్ళ రామ్ నరసింహ గౌడ్ పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ .. తెలంగాణ హక్కుల దినంగా పాటిదాం,ఉద్యమ ఆకాంక్ష లను సాధించుకుందాం అని అన్నారు.

ఉచిత అల్పాహారానికి 1000 రోజులు పూర్తి

విశ్వంభర, ఎల్బీనగర్ : హైదరాబాద్ దిల్సుఖ్నగర్ లోని రామ్ సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం 7 గంటల నుండి నిత్య ఉచిత అల్పాహారం ఏర్పాటుచేసి ఎంతోమందికి అల్పాహారాన్ని అందిస్తున్నామని రామ్ సేవా సమితి అధ్యక్షులు కుంచెం నరసింహారావు, చైర్మన్ విజయ్ కుమార్ అగర్వాల్, ప్రధాన కార్యదర్శి బాలరాజ్, జగిని శ్రీనివాస్ తెలిపారు. ప్రపంచ మహిళా దినోత్సవ సందర్భంగా ప్రత్యేకంగా సుమారు 250 నుండి 300 మంది వరకు అల్పాహారాన్ని అందించడం జరిగిందని తెలిపారు. మంగళవారంతో 1000 రోజులు పూర్తి చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ట్రస్టు ద్వారా అయోధ్య రామ మందిరం దగ్గర కూడా అల్పాహార కార్యక్రమం ఏర్పాటు చేస్తామని రామ్ సేవా సమితి సభ్యులు తెలిపారు.

హైదరాబాద్ మహానగరంలో

రూపాయికే లగ్గం

విశ్వంభర, ఎల్బీనగర్ : హైదరాబాద్ మహానగరంలో రూపాయి ఫౌండేషన్ చైర్మన్ అనిల్ కుమార్,ప్రాజెక్టు చైర్మన్ జగిని శ్రీనివాస్, కో చైర్మన్ యడవెల్లి బాలరాజు ఆధ్వర్యంలో సైదాబాద్ డివిజన్ ఎస్ బి హెచ్ కాలనీలోని శ్రీనివాస కమ్యూనిటీ హాల్ లో నిరుపేద జంట చంద్రిక చందర్ లకు ఘనంగా వివాహం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమల్ల అనిల్ కుమార్, జగిని శ్రీనివాస్, బాలరాజు మాట్లాడుతూ.... ఓ నిరుపేద జంటకు పెళ్లి చేయడం మాకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. మా రూపాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 14 పెళ్లిళ్లు చేశామని అన్నారు. పెళ్లికి సహాయం చేయాలని వారు మమ్మల్ని సంప్రదించగా... వారికీ పెళ్లి బట్టలు, తాళి, మట్టెలు అందజేసి వేద పండితుడి ఆధ్వర్యంలో కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా పెళ్లి జరిపామని అన్నారు. పెళ్లికి వచ్చిన కుటుంబ సభ్యులకు భోజనం ఏర్పాట్లు కూడా చేశామని తెలిపారు. కుల మతాలకు అతీతంగా ఆర్థికంగా వెనుకబడిన నిరుపేదలు , దివ్యాంగ వదూవరులు వారి పెళ్లి కోసం మమ్మల్ని సంప్రదిస్తే... వారి వివాహాన్ని దగ్గరుండి జరిపిస్తామని తెలిపారు. వివరాలకు 9246736533 నెంబర్ ను సంప్రదించాలని కోరారు.

కుప్పకూలిన స్టాక్‌మార్కెట్లు

ఇన్వెస్టర్ల కొంపముంచిన యుద్ధ భయాలు

విశ్వంభర, ఢిల్లీ : భారతీయ స్టాక్‌మార్కెట్లు మరోసారి భారీ పతనాన్ని మూటగట్టుకున్నాయి. ఇరాన్ అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో మదుపర్లు ఆందోళనకు గురై అమ్మకాలకు మొగ్గు చూపారు. ఈ ఫలితంగా బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 1352 పాయింట్ల నష్టంతో ముగియగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 422 పాయింట్ల భారీ నష్టాన్ని చవిచూసింది. ఈ భారీ పతనంతో కేవలం ఒక్కరోజే ఇన్వెస్టర్ల సంపద లక్షల కోట్ల రూపాయల మేర ఆవిరైపోయింది. ముఖ్యంగా బ్యాంకింగ్, ఆటోమొబైల్, ఐటీ రంగాల షేర్లు తీవ్రమైన ఒత్తిడికి లోనయ్యాయి.

మార్కెట్ పతనానికి ప్రధాన కారణాలు..

ఈ భారీ నష్టాలకు ప్రధానంగా పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలు కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికాఇజ్రాయెల్ vs ఇరాన్ మధ్య ఘర్షణలు తీవ్రం కావడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ (ముడి చమురు) ధరలు భారీగా పెరిగాయి. చమురు ధరల పెరుగుదల వల్ల భారత్ వంటి దిగుమతి దేశాలపై ద్రవ్యోల్బణం భారం పడుతుందనే భయం మార్కెట్‌ను కుదిపేసింది. దీనికి తోడు రూపాయి విలువ రికార్డు స్థాయికి పడిపోవడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు పెద్ద ఎత్తున నిధులను వెనక్కి తీసుకోవడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.

నగర గ్రంథాలయ సమస్యలపై

జిహెచ్ఎంసి కమిషనర్‌కు వినతి

విశ్వంభర, హైదరాబాదు : నగర గ్రంథాలయ సంస్థకు సంబంధించిన పలు ముఖ్య సమస్యలపై జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్. వి. కరణ్‌ను అశోక్ నగర్ లోని నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్ రెడ్డి, కార్యదర్శి పొట్లూరి పద్మజ కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర గ్రంథాలయానికి నూతన భవన నిర్మాణం చేపట్టేందుకు ఇప్పటికే పూర్తయిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. అలాగే ప్రజలకు ఉపయోగపడే విధంగా ఇందిరమ్మ కాంటీన్ ఆధ్వర్యంలో ఐదు రూపాయల మిల్లెట్స్ క్యాంటీన్‌ను గ్రంథాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల ప్రారంభమైన చాచా నెహ్రూ పార్క్ గ్రంథాలయాన్ని అధికారికంగా నగర గ్రంథాలయ సంస్థకు అప్పగించాలని వినతిపత్రంలో ప్రస్తావించారు. నగర గ్రంథాలయ సంస్థకు రావలసిన సెస్సును మంజూరు చేసి పెండింగ్ బిల్లులకు సంబంధించిన చెక్కులను త్వరగా విడుదల చేయాలని కోరారు. నగర గ్రంథాలయ సంస్థ పరిధిలో నిర్మాణంలో ఉన్న గ్రంథాలయ భవనాలకు సంబంధించిన బిల్లులను విడుదల చేసి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ఆ భవనాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మరమ్మతులు జరుగుతున్న గ్రంథాలయ భవనాలకు సంబంధించిన బిల్లులను కూడా త్వరగా విడుదల చేయాలని తెలిపారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కరణ్ నగర గ్రంథాలయ సంస్థకు నూతన భవన నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ బిల్లులను త్వరలో మంజూరు చేస్తామని, గ్రంథాలయాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

డిజిటల్ ప్రపంచంలో అప్రమత్తతే కీలకం

సైబర్ క్రైమ్ డీఎస్పీ

విశ్వంభర, ఖమ్మం : డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా ఉండేందుకు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండటమేనని సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణిందర్ అన్నారు. కిన్నెర నర్సింగ్ కాలేజీలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. బ్యాంక్ ఖాతా నుండి డబ్బు పోతే, వెంటనే బ్యాంక్‌కు సమాచారం అందించి ఖాతాను స్తంభింపజేయాలని తెలిపారు.అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయకపోవడం, బలమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించడం, వ్యక్తిగత, బ్యాంకింగ్ సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోకపోవడం ద్వారా ఆన్‌లైన్ మోసాలను అరికట్టవచ్చని అన్నారు. సైబర్ మోసానికి గురైనట్లయితే, వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్ లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ స్టాకింగ్, నకిలీ సోషల్ మీడియా ప్రొఫైల్ మోసం, డిజిటల్ అరెస్ట్, వ్యాపార పెట్టుబడి,లోన్ యాప్, ఆన్‌లైన్ భద్రతా చిట్కాలు,బెట్టింగ్ యాప్, డిజిటల్ అరెస్ట్, పెట్టుబడి మోసాలు, గోల్డెన్ అవర్ యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సైబర్ నేరాలపై విద్యార్థులకు క్విజ్ నిర్వహించారు.విజేతలకు బహుమతులు అందజేశారు.

ఎల్లమ్మ తల్లి దయ ఉండాలి

విశ్వంభర, సిద్దిపేట : రేణుక ఎల్లమ్మ దేవాలయ 50ఏళ్ల వార్షికోత్సవం జరుపుకోవడం అందులో నేను పాల్గొనే భాగ్యం కలగడం తల్లి అనుగ్రహమేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట రేణుక ఎల్లమ్మ దేవాలయ స్వర్ణోత్సవ వార్షికోత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ సిద్దిపేట రేణుక ఎల్లమ్మ తల్లి దయ ఉంటే అన్నింటా మంచి జరిగినట్టేనని, తల్లి ఎంతో మహిమన్విత అమ్మవారన్నారు. వార్షికోత్సవాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని చెప్పారు. గౌడ సమాజం కోసం దేవాలయం ముందే రాష్ట్రంలోనే ఆదర్శంగా రూ.6కోట్లతో ఏసీ ఫంక్షన్ హాల్ నిర్మించుకున్నామన్నారు. ఆలయ నిర్వాహకుల కోరిక మేరకు ఆలయానికి ఎల్లప్పుడూ ఏ సహాయమైన అందించానని, భవిష్యత్ లో కూడా అభివృద్ధికి కృషి చేస్తానని హామీనిచ్చారు. 50ఏళ్ల ఉత్సవాలు జరుపుకొంటున్న సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎల్ బి నగర్ లో ఏసీబీ దాడులు

లంచం తీసుకుంటూ పట్టు బడ్డ ఇద్దరు ఎస్ఐలు

విశ్వంభర, ఎల్బీనగర్ : సైబర్ క్రైమ్ కేసు నిమిత్తం అకౌంట్ ఫ్రీజ్ చేయకుండా ఉండడం కోసం బాధితులను ఒక లక్ష రూపాయలు డిమాండ్ చేసిన ఆర్ ఎస్ ఐ లు ప్రమోద్ కుమార్ గౌడ్, బాబు నాయక్..బాధితులు ఏసీబీ ని ఆశ్రయించడంతో లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డ. వారిని అరెస్టు చేసి కోర్టులో రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ఏసీబీ హైదరాబాద్ రేంజ్ 2 డి ఎస్ పి గంగసాని శ్రీధర్ ఆధ్వర్యంలో బృందం సైబర్ స్టేషన్ లో సోదాలు నిర్వహించారు.

ఇంజినీరింగ్ విద్యార్థి అనుమానాస్పద మృతి

విశ్వంభర, అనంతపురం : అనంతపురం నగర శివారులోని అనంత లక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. నైలాన్ తాడుకు వేలాడుతూ తోటి విద్యార్థులకు కనిపించడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. విద్యార్థి హరి ప్రసాద్ మొబైల్ పూర్తిగా పగిలిపోవడం పై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతి చెందిన విద్యార్థి రాయదుర్గం మండలం దొడగట్ట చెందిన హరి ప్రసాద్ గా పోలీసులు గుర్తించారు.

మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ కృషి

విశ్వంభర, అశోక్ నగర్ : మహిళల అభ్యున్నతి కోసం సీఎం రేవంత్ రెడ్డి పాటుపడుతున్నారని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పురపాలక సంఘంలో పనిచేస్తున్న పారిశుధ్య మహిళా సిబ్బందికి చీరలు అందజేసి శాలువతో సన్మానించి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అత్తు ఇమామ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామన్నారు. ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం 200 యూనిట్లకు ఉచిత విద్యుత్ రూ.500రూపాయలకే సబ్సిడీ కింద గ్యాస్ సిలిండర్, వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మహిళలకు పథకాలు అమలు చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని మరో పదేండ్లు ఆశీర్వదించాలని కోరారు. కాంగ్రెస్ పథకాలను ఇతర రాష్ట్రాలు కూడా అమలు చేస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో గ్యాదరి మధు, గయాజుద్దీన్, హర్ష హుస్సేన్, అజ్మత్, విజయ డానియల్, మున్నా, సంతోషి, ముదసిర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం

విశ్వంభర, గౌలి పుర : గౌలి పురాలోని శ్రీ సరస్వతి విద్యా మందిర్ లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1981 లో మొదలైన ఈ పాఠశాలఎన్నో ఒ దుదుడుకులు పడుతూ, నిరంతరం అభివృద్ధి చెందుతూ, నూతన వరవడికి నాంది పలుకుతూ, పిల్లల భవిష్యత్తులకు పునాదులు వేస్తూన్న, ఈ పాఠశాలలో విద్యను బోధించిన, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, బోధనను పొందిన విద్యార్థిని విద్యార్థులు, పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమా నికి శ్రీకారం చుట్టారు.వయసుతో సంబంధం లేకుండా ఎంత ఎదిగినా ఒదిగినట్టు, గౌరవాన్ని చూపిస్తూ, కన్నీటి పర్యంతం, ఆనందభాష్పాలు, వివిధ హావభావాల సందర్భంలో అద్యంతం చూపర్లను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్ బి సుబ్రహ్మణ్యం(విద్యా భారతి క్షేత్ర ఉపాధ్యక్షులు), రచిట్ పాఠక్ ,పతాకమూరి శ్రీనివాస్ (విద్యాపీఠ ప్రాంత సంఘచన కార్యదర్శి తెలంగాణ)ఆలే శ్యాం కుమార్, పాఠశాల అధ్యక్షులు విజయ కుమార్ విటల్ దాస్ (ప్రముఖ వ్యాపారవేత్త), రూప్ రాజ్ లు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.